అభివృద్ధి పేరిట అడ్డగోలు తవ్వకాలు



వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలో సీసీ రోడ్డు వేసేందుకు తవ్విన పాత రోడ్డు


హస్తినాపురం ఈస్ట్‌లో పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డు

- పలుచోట్ల బాగున్న రోడ్లకే మళ్లీ మళ్లీ మరమ్మతులు
- వృథాగా పోతున్న ప్రజాధనం

వనస్థలిపురం: రాజుల సొమ్ము రాళ్లపాలు... జీహెచ్ఎంసీ డబ్బులు రోడ్లపాలు అనుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. పలు కాలనీల్లో అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్లను తవ్వడం, ఆపై రోడ్లు వేయడం, ఏడాదో, రెండేళ్లో గడవగానే డ్రైనేజీ మరమ్మతులు, పైప్‌లైన్ల కోసమని తిరిగి రోడ్లను తవ్వడం.. మళ్లీ వేయడం పరిపాటిగా మారింది. శివారు కాలనీల్లో ఇప్పటికీ పలు ప్రాంతాల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నా వాటిని పట్టించుకోని అధికారులు అభివృద్ధి చెందిన చోటే రోడ్లు తవ్వి.. తిరిగి వేస్తూ ప్రజా సొమ్మును వృథా చేస్తున్నారని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం ఈస్ట్‌లో ప్రధాన రోడ్డులో వర్షాకాలంలో నీరు నిలిచి గుంతలు పడటంతో ఇటీవల కొత్తగా సీసీ రోడ్డు వేశారు. కాగా మళ్లీ పైప్‌లైన్ కోసం బాగున్న రోడ్డును తవ్వేశారు.
- వనస్థలిపురం డివిజన్ శ్రీనివాసపురం కాలనీలో ప్రధాన రహదారిలో కొత్తగా సీసీ రోడ్డు వేయడానికి అడ్డంలా ఉన్న రోడ్డును జేసీబీలతో తవ్వేశారు. దీంతో ఆ దారిన వెళ్లాల్సి వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు.
- బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం డివిజన్లలో ఇంకా పలు కాలనీల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. మట్టిరోడ్లను బీటీ, సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, అభివృద్ధి చెందిన కాలనీల్లోనే మళ్లీ మళ్లీ రోడ్లను వేస్తున్నారని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.
- సంపన్నులు, రాజకీయ పలుకుబడి గల వ్యక్తులు నివాసం ఉండే కాలనీల్లోని రోడ్లపై చిన్న గుంత పడినా, డ్రైనేజీ సమస్య వచ్చినా వెంటనే మరమ్మతులు చేపడుతున్నారని, శివారు కాలనీలను జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.
- కాలనీల్లో మొదట మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తయిన తర్వాత రోడ్లను వేయాల్సి ఉండగా, ఇష్టారీతిన రోడ్లను వేసి.. మళ్లీ పైప్‌లైన్ల మరమ్మతుల కోసం వాటిని తవ్వుతూ తిరిగి వేస్తూ కాంట్రాక్టర్లకు లాభం చేకూరుస్తూ అధికారులు తాము కూడా లబ్ధి పొందుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.
- ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తయిన తర్వాతే రోడ్లను నిర్మించాలని, అప్పుడే ఆ రోడ్లు చాలాకాలం చెక్కు చెదరకుండా ఉంటాయని, ప్రజాధనం కూడా వృథా కాదని ప్రజలు అంటున్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 20, దొండ 28-43, చిక్కుడు 23-40, గోకర 45, బీట్‌రూట్ 20, క్యాప్సికం 60, ఆలు 21-23, దోస 23, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 55. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

మహాకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు


అన్నప్రసాద వితరణలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

నాగోలు: నాగోలు గ్రామంలోని మహాకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతినెలా అమావాస్య పర్వదినం రోజున అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కమిటీ చైర్మన్ బద్దం మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కందికంటి కన్నా గౌడ్, కోశాధికారి బద్దం నరేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు రావుల రాజు గౌడ్, సంయుక్త కార్యదర్శి చెరుకు గణేష్ గౌడ్, గ్రామ పెద్దలు బద్దం ధనుంజయ్ గౌడ్, బద్దం వెంకటేష్ గౌడ్, గోల్కొండ మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

12న అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

నాగోలు: బండ్లగూడ శ్రీనివాస్‌కాలనీలోని అభయాంజనేయ ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 12న నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు మోటుపల్లి లక్ష్మీరామాచార్యులు శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం సుప్రభాతం, నిత్యారాధన, పంచామృత, సింధూరాభిషేకం, సహస్ర ఆకుపూజ అలంకరణ, బాలభోగం తీర్థగోష్టి, విష్వక్సేన ఆరాధన, మన్యుసూక్త మూల మంత్ర హోమం, హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములవుదాం


మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి. చిత్రం బ్యాంక్ మేనేజర్ రవీందర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేందర్‌మోదీ చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్ రెడ్డి నగర్ ఎస్‌బీఐ బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని, అర్హత కలిగిన ప్రతీ పేద ప్రధాన మంత్రి ప్రకటించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం బ్యాంక్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు.కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రావు, నాయకులు శంకరయ్యగౌడ్, రఘురాంనేత, నర్సింహారెడ్డి, సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ జైపాల్‌రెడ్డి, రవిశంకర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం చెక్కును అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సాయినాథ్ ఆలయానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి 25 వేల రూపాయల విరాళం ఇచ్చారు. ఆర్‌కేపురంలో తన నివాసంలో శుక్రవారం ఆయన విరాళం చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ, హర్షవర్ధన్ రెడ్డి, రవీందర్ సింగ్, సైనల విజయ్, కృష్ణారావు, రేపల వినయ్ పాల్గొన్నారు.

నేడు 'రవీంద్రభారతి'లో సైన్స్ ఎక్స్‌పో-2024

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని రవీంద్రభారతి స్కూల్లో శనివారం సైన్స్ ఎక్స్‌పో-2024 నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల వారీగా రూపొందించిన నమూనాలను ప్రదర్శిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు సకాలంలో విచ్చేసి సైన్స్ ఎక్స్‌పో తిలకించి, విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలని కోరారు.

'క్రిడా' కార్మికుల పని దినాలు పెంచాలి

మన్సూరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'క్రిడా' (సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్) లో పని చేస్తున్న కార్మికులతో వెట్టి చేయిస్తున్నారని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి ఆరోపించారు. దినసరి కార్మికుల పని దినాలను నెలకు 22 రోజుల నుంచి 26 రోజులకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 16న జరిగే కార్మిక సమ్మెలో క్రిడా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం ఆ సంస్థ ఎదుట కార్మికులతో కీసర నర్సిరెడ్డి గేట్ మీటింగ్ నిర్వహించారు.


గేట్ మీటింగ్‌లో పాల్గొన్న కార్మికులు

జైళ్లశాఖ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోండి

- జెడ్సీకి జాతీయ బీసీ సంఘం వినతి

సైదాబాద్: తెలంగాణ జైళ్లశాఖకు చెందిన స్థలంలో కబ్జాదారులు చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చార్మినార్ జోనల్ కమిషనర్ (జెడ్సీ) వెంకన్నను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ, సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న జైళ్లశాఖ స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని అన్నారు. అదే విధంగా సైదాబాద్‌లో నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి పురాతన హనుమాన్ ఆలయం పైనుంచి వెళ్లకుండా అలైన్‌మెంట్ మార్చాలని కాంట్రాక్టర్‌ను, సంబంధిత అధికారులను ఆదేశించాలని ఆయన కోరారు.



జెడ్సీకి వినతి పత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాదవ్

ఎల్‌బీనగర్‌లో పెరిగిన ఓటర్లు

- తాజా జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 6,00,450
- పురుషులు 3,12,163
- మహిళలు 2,88,153
- ఇతరులు 134



ఎల్‌బీనగర్ నియోజకవర్గం మ్యాప్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఓటర్ల తుది జాబితా విడుదలైంది. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన జాబితా ప్రకారం ఇప్పుడు ప్రకటించిన జాబితాలో సుమారు 6,738 మంది ఓటర్లు పెరిగారు.

- గత నెలలో ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 5,93,712 మంది కాగా, గురువారం సాయంత్రం ప్రకటించిన జాబితాలో 6,00,450 మంది ఓటర్లు ఉన్నారు.
- ఇందులో పురుషులు 3,12,163 మంది, మహిళలు 2,88,153 మంది, ఇతరులు 134 మంది ఉన్నారు.
- గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఎల్‌బీ నగర్ నియోజకవర్గ ఓటర్లు 5,93,712 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,09,557 మంది, మహిళలు 2,84,024మంది ఉన్నారు.
- తాజా జాబితా ప్రకారం పురుష ఓటర్లు 2606 మంది, మహిళా ఓటర్లు 4,129 మంది పెరిగారు.
- మొత్తం 6,00,450 మంది ఓటర్లలో యువ ఓటర్లు 10,673 మంది, వయోవృద్ధ ఓటర్లు సుమారు 8,948 మంది ఉన్నారు.

నో ఎంట్రీ టైమ్‌లోనూ అనుమతించాలి

ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ డిమాండ్


ఎల్‌బీనగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: ప్యాకర్స్ అండ్ మూవర్స్ సేవలు అందిస్తున్న డీసీఎం వాహనాలకు నో ఎంట్రీ సమయంలో కూడా నగరంలోకి అనుమతి ఇవ్వాలని ఎల్‌బీనగర్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండూరి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కమ్మల సైదులు యాదవ్ కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మన్సూరాబాద్ నుంచి ఎల్‌బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్యాకర్స్ అండ్ మూవర్స్ వాహనాలకు గతంలో ఉదయం 5 నుంచి 11 గంటల వరకు నగరంలోకి అనుమతి ఉండేదని, నో ఎంట్రీ సమయంలో నగరంలోకి వస్తే రూ.500 జరిమానాతో అనుమతి ఇచ్చేవారని గుర్తు చేశారు. నూతన నిబంధనల ప్రకారం నో ఎంట్రీ సమయంలో నగరంలోకి వస్తే వాహనాన్ని సీజ్ చేసి ఆర్టీఓకి అప్పగిస్తున్నారని, దీంతో రోజంతా వాహనం ఆర్టీఓ కార్యాలయంలోనే ఉండటమే కాకుండా మరుసటి రోజు ఆర్టీఓ అధికారులు ఎంత జరిమానా వేసినా చెల్లించి వాహనాన్ని విడిపించుకోవాల్సి వస్తోందని వాపోయారు. దీంతో వాహన యాజమానులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కొత్త నిబంధనను రద్దు చేసి గతంలో ఉన్న నిబంధనలనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లింగారెడ్డి, అంజయ్య, మల్లేష్, వెంకట్ రెడ్డి, లింగస్వామి, నర్సింహ, నర్సిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం చేయాలి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

చంపాపేట: ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలోని జీహెచ్ఎంసీ మినీ ఫంక్షన్ హాల్‌లో సంక్షేమ పథకాల లబ్ధిదారులు, దరఖాస్తుదారులు బీజేపీ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని ఎల్ఈడీ తెరపై ప్రదర్శించారు. అనంతరం మోదీ అమలు చేస్తున్న పథకాలతో కూడిన నూతన సంవత్సర కేలండర్‌ను మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు యోగిరాజ్, అనిల్, పాశం శ్రీశైలం, శ్రీనివాస్, శేఖర్, శ్రీధర్, సాయిప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని 31, 35 డివిజన్ల కార్పొరేటర్లు విజయలక్ష్మి, సౌందర్య శుక్రవారం కమిషనర్ వాణికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సర్వే నం 119లో రోడ్డుపై సెట్‌బ్యాక్ లేకుండా సెల్లార్ నిర్మాణం చేపడుతున్నారని, దీంతో పాటు అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని తెలిపారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు చేసినప్పటికీ, నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటూ.. పరోక్షంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు కోరారు.

అభయహస్తం దరఖాస్తులపై విచారణ

బడంగ్‌పేట్: అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, మేనేజర్ నగేశ్, సిబ్బంది శుక్రవారం విచారణ చేపట్టారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు తప్పులు దొర్లడంతో పాటు రేషన్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్ తదితర అంశాలను సరిచేసి అప్‌లోడ్ చేస్తున్నారు.

'భూ కబ్జాదారులను వదిలిపెట్టం'

మహేశ్వరం: ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను కబ్జా చేసినా.. సహకరించినా వదిలిపెట్టమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో అసైన్డ్ భూములను బీఆర్ఎస్ నేతలు పట్టా భూములుగా మార్చుకొని రిజిస్ట్రేషన్ చేసి అక్రమాలు పాల్పడుతున్నారని ఆరోపించారు. హైకోర్టు స్టే ఆర్డర్‌లో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయించి.. హెచ్ఎండీఏ లే అవుట్‌లకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చెరువుల సుందరీకరణ పేరుతో భూములను కబ్జా చేసి విక్రయించారని తెలిపారు. కుంటలు, వాగులను కూడా వదలేదని మండిపడ్డారు.

అయోధ్య బయలుదేరిన భక్తులకు వీడ్కోలు


అయోధ్య వెళుతున్న భక్తులతో నర్సింహారెడ్డి


అయోధ్య వెళుతున్న వారితో నరేష్‌యాదవ్

మన్సూరాబాద్/హస్తినాపురం: అయోధ్యలోని భవ్య రామమందిర దర్శనానికి ప్రత్యేక రైలులో బయలుదేరిన మన్సూరాబాద్‌కు చెందిన భక్తులకు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వీడ్కోలు పలికారు. అలాగే, హస్తినాపురం నుంచి అయోధ్యకు బయలుదేరిన రామభక్తులకు స్థానిక సీతారామాంజనేయ ఆలయంలో బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ నరేష్‌యాదవ్ వీడ్కోలు తెలిపారు.

పల్లవి ఇంజినీరింగ్ కాలేజీకి అటానమస్ హోదా



మాట్లాడుతున్న నవీన్ కుమార్

పంజగుట్ట: నాగోలు కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీకి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ పదేళ్ల పాటు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించిందని కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజుతో కలిసి మాట్లాడారు. గత 30 ఏళ్లుగా విద్యారంగంలో అగ్రగామిగా నిలుస్తూ, ఎంతో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఐదు ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లు, 13 పల్లవి స్కూళ్లు, ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఈ అటానమస్ హోదా దక్కడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వారికి మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సుమేధా రమేష్, డాక్టర్ శ్రవంతి, ఎం.రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటన హర్షణీయం

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల ఆద్యుడైన పీవీకి ప్రధాని మోదీ భారతరత్న ప్రకటించడం తెలుగువారందరికీ గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పీవీ కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం

వనస్థలిపురం: మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడంపై రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చింతపల్లి మంగపతి రావు, అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బహుభాషా కోవిదుడు, వివిధ రంగాలలో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన పీవీకి భారతరత్న ఇవ్వడం యావత్ బ్రాహ్మణ జాతికి గర్వకారణమన్నారు. పీవీ కుటుంబ సభ్యులకు వారు శుభాకాంక్షలు అందజేస్తూ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సైదాబాద్: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పీవీ కుటుంబసభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

రేపు డెంటల్, ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ శ్రేష్ఠ శ్రీ కమలా హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ పెద్ది తెలిపారు. ఆర్థోపెడిక్, డెంటల్, ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ విభాగాలలో ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. 50 ఏళ్లు పైబడిన వారికి ఎముకల్లో కాల్షియం శాతాన్ని తెలియజేసే బీఎండీ పరీక్ష ఉచితంగా చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. వివరాలకు ఫోన్ నం. 8908901188 లో సంప్రదించవచ్చన్నారు.

నేడు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి నాటక ప్రదర్శన

వనస్థలిపురం: తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో కళావిపంచి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బలక్ష్మి నాటకాన్ని శనివారం ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు. భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో శ్రీ సాయి సంతోషి నాట్యమండలి స్టేషన్ ఘన్‌పూర్ సురభి కళాకారులు వనస్థలిపురం ఎన్జీఓస్‌కాలనీలోని చంద్రకళా వేదికపై సాయంత్రం 5.30 గంటలకు ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారన్నారు. సీనియర్ జర్నలిస్టు ఎస్వీ రామారావు, ప్రముఖ సాహితీవేత్త, సినీ రచయిత డా.వడ్డేపల్లి కృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.